VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 77

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 29 జూలై 2025


## కొత్త ఆలోచనలు, ఆధునికత కలయికే 'అమరావతి'

- ఉత్తమ విధానాలతో ఏపీ భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నాం
- సింగపూర్ - ఆంధ్రప్రదేశ్ మధ్య సహకారం కొనసాగాలి
- ప్రభుత్వాల మధ్య అంతరం తగ్గించడమే పర్యటన ఉద్దేశం
- రెండో రోజు సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2 గంటల పాటు కాలినడకన బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు పరిశీలన
- పర్యావరణహితంగా నివాస సముదాయ నిర్మాణంపై ప్రశంసలు












**సింగపూర్, కలంకౌంటర్ :** రెండో రోజు సింగపూర్ పర్యటనలో భాగంగా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. సోమవారం సింగపూర్‌లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. కొత్త ఆలోచనలతో, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం ఉత్తమ విధానాలు అనుసరిస్తూ భవిష్యత్ నగరాన్ని తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ – ఏపీ ప్రభుత్వాల మధ్య కొంత అంతరం వచ్చిందన్న అంశాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంతో పాటు.. ఉన్న గ్యాప్ ను తగ్గించేందుకు ప్రస్తుతం తాను సింగపూర్ వచ్చానని తెలిపారు. భవిష్యత్‌లోనూ సింగపూర్–ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

**ప్రకృతితో మమేకమవుతూ...** బిడదారి ఎస్టేటులో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టిన విధానాన్ని సింగపూర్ అధికారులు చంద్రబాబుకు వివరించారు. చెట్లు తొలగించకుండా, సహజ నీటి వనరులు దెబ్బతినకుండా... ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ప్రకృతితో మమేకమయ్యేలా చేపట్టిన ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవడంతో పాటు.. ఆహ్లాదాన్ని పంచే విధంగా నిర్మాణాలు చేపట్టామని ఆ దేశ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గృహ సముదాయాల నిర్మాణం ఖర్చు ఏ మేరకు ఉందనే అంశం పైనా

- 2లో

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణ స్వీకారం

- న్యాయమూర్తిగా ప్రమాణం చేయించిన ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



**హైకోర్టు (అమరావతి),కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మద్రాసు హైకోర్టు నుండి బదిలీపై రాష్ట్ర హైకోర్టుకు వచ్చిన ఆయనచే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఏపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఏపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## వచ్చే నెల 6 నుంచి బీసీ హాస్టళ్లలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలు

### –రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** బీసీ హాస్టళ్లలో విద్యార్థుల మానసిక ఒత్తిడిని దూరం చేయడంతో పాటు వారి మధ్య స్నేహ పూర్వక వాతావరణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ హాస్టళ్లలోనూ ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో మూడ్రోజుల పాటు బీసీ హాస్టళ్లలో ఫ్రెషర్స్ డే నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే బీసీ హాస్టళ్లలో అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. వచ్చే నెల అయిదో తేదీలోగా అడ్మిషన్లు ముగించాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను ఆదేశించామన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే 6,7,8 తేదీల్లో ఫ్రెషర్స్ డే నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అన్ని బీసీ హాస్టళ్లలోనూ ఈ వేడుకలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని తరగతుల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు ఈ ఫ్రెషర్స్ డే వేడుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారితో పాటు జిల్లా కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎమ్డీవోలు...ఇలా అన్ని స్థాయి అధికారులు కూడా ఈ వేడుకల్లో పాల్గొనబోతున్నారన్నారు. కొత్త ప్రాంతం, కొత్త మనుషుల కావడం వల్ల సహజంగానే విద్యార్థులు బిడియం, భయానికి లోనవుతారన్నారు. ఫ్రెషర్స్ డే నిర్వహణ వల్ల విద్యార్థుల మధ్య సుహృద్భావ, స్నేహ పూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. కొత్త స్నేహితులతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసి, నూతనోత్సాహం కలిగించడమే ఫ్రెషర్స్ డే లక్ష్యమని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## గిన్నిస్ రికార్డుల్లో మెగా పీటీఎం

- ఈ రికార్డు ఉపాధ్యాయులకే అంకితం
- 53.4 లక్షల పేరెంట్స్, టీచర్స్ పాల్గొన్న అతిపెద్ద పీటీఎంగా రికార్డ్
- ప్రత్యక్షంగా పరోక్షంగా 1.5 కోట్ల మంది హాజరు
- గిన్నిస్ రికార్డ్ సాధనలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్






ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్–టీచర్ మీటింగ్ (MEGA PTM) నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పిందని, ఈ గిన్నిస్ రికార్డు ఉపాధ్యాయులకు అంకితం అని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 5.34 మిలియన్ల (53.4 లక్షలు) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (SMC) సభ్యులు, ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారితో సహా మొత్తం 15.2 మిలియన్ల (1.5 కోట్లు) మంది అతిపెద్ద పేరెంట్–టీచర్ మీటింగులో భాగమయ్యారు. జాతీయ విద్యా విధానం ఐదవ వార్షికోత్సవం జూలై 29కి ఒక రోజు ముందు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ గిన్నిస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయిప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు MEGA PTMని విజయవంతం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఈ అరుదైన రికార్డు సాధనలో భాగమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వికాసానికి, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాశాఖ చేస్తున్న కృషిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించడం హర్షణీయమన్నారు.

**రికార్డు నమోదు ఇలా...** MEGA PTM నుండి సేకరించిన డేటాను నిశితంగా ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డు అధికారికంగా గిన్నిస్ రికార్డు బృందం ధ్రువీకరించింది. ఇందులో మూడు ఫోటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సంఖ్య మరియు ప్రతి పాల్గొన్న పాఠశాల నుండి

- 4లో

VAARAHI
SILKS
Threads of Luxury, Woven with love...



Patola Banaras | Kanjeevaram | Paithani | Organza | Chikankari | Soft Pattu | Muslin
Bandhini | Kanchi Tissue | Crush Tissue | Designer Tussar | Georgette | Fancy | Ikkat
VAARAHI SILKS Ph. 91000 03343 | www.vaarahisilks.com
Road No. 36, Jubilee Hills | Road No.1, Kukatpally.
SCAN TO FOLLOW US ON
INSTAGRAM FACEBOOK

# విద్యావేత్త మరణం పట్ల సంతాపం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ బాలాజీ విద్యాలయం వ్యవస్థాపకురాలు, శ్రీవాణి మాసపత్రిక సంపాదకురాలు కొమరగిరి జయప్రద మరణంపై ప్రముఖ సీనియర్ న్యాయవాది, లంకి శెట్టి బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు, పి. వి. ఫణి కుమార్ లు విచారం వ్యక్తం చేశారు. వారి పార్థివ దేహానికి సోమవారం నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి - జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**బాపట్ల,కలంకౌంటర్ :** అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటివేధింపులు,ఆస్తితగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 60 మంది అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, చీరాల డిఎస్పి మోయిన్, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఆహారం పంపిణీ



**కందుకూరు, కలంకౌంటర్ :** ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ(8341221414) కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం తటవర్తి వెంకటేశ్వర్లు, బీబీ జానమ్మ (కందుకూరు వాసవి వనిత క్లబ్ ట్రెజరర్) కుమార్తె తటవర్తి హేమంత సౌమ్య లక్ష్మీ మీనా కుమారి పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే యాచకులకు,నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు సేవా హృదయ రవ్వా శ్రీనివాసులు (ఎల్. ఐ.సి %ు% స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ) మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు ఇంటికే పరిమితం కాకుండా ఒక పూట పేదల ఆకలిని తీర్చడం ఎంతో మంచి పుణ్య కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియల్ చైర్మన్.కోట వెంకటేశ్వర్లు,ఇన్నమూరి శ్రీనివాసులు మరియు దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం



**కందుకూరు, కలంకౌంటర్ :** శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు పట్టణంలోని 6వ వార్డులో సుపరిపాలన తొలి ఏడాది కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ తొలి సంవత్సరంలో కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మరియు సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ మున్నా నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సలీం,వార్డు ప్రధాన కార్యదర్శి జంగాల మాలాద్రి, రమేష్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి

- మాది పెట్టుబడుల ఫ్రెండ్లీ ప్రభుత్వం
- విశాఖ పెట్టుబడుల సదస్సుకు సింగపూర్ మంత్రికి ఆహ్వానం
- సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం భేటీ
- ఏపీలో హౌసింగ్, సబ్ సీ కేబుల్ రంగంలో పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్

**సింగపూర్,కలంకౌంటర్ :** గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్ లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు.



మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు.

**గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగాల్లో కలిసి పని చేసేందుకు సింగపూర్ ఆసక్తి**

ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్- ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 22 నుంచి దసరా మహోత్సవాలు

- అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు వైభవంగా ఉత్సవాల నిర్వహణ
- ఆలయ ఈవో వీకే శీనానాయక్





**విజయవాడ,కలంకౌంటర్ :** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వీకే శీనానాయక్ తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న దసరా మహోత్సవాల నిర్వహణపై సోమవారం కార్యనిర్వహణ అధికారి వీకే శీనానాయక్ .. వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులతో కలిసి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు సంబంధించి శుభ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. అనంతరం ఈవో మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలను సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దసరా మహోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశవిదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తారన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన జరిగేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని, ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖామాత్యులు, కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివ ప్రసాద్ శర్మ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు 11 రోజులపాటు 11 అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 22వ తేదీన ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని.. 23వ తేదీన శ్రీ గాయత్రీ దేవి, 24వ తేదీన శ్రీ అన్నపూర్ణాదేవి, 25వ తేదీన శ్రీ కాత్యాయని దేవి, 26వ తేదీన శ్రీ మహాలక్ష్మీ దేవి, 27వ తేదీన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, 28వ తేదీన శ్రీమహా చండీ దేవి, 29వ తేదీన మూలా నక్షత్రం రోజున శ్రీ సరస్వతీ దేవి, 30వ తేదీన శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న శ్రీ మహిషాసురమర్దినీ దేవి, అక్టోబర్ 2న విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. మూలా నక్షత్రం రోజున రాష్ట్ర ప్రభుత్వం తరఫున గౌరవ ముఖ్యమంత్రివర్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. అక్టోబర్ 2వ తేదీన విజయదశమి రోజున ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుగుతుందన్నారు. ఏటా మాదిరిగానే అర్చక సభలు, వేద సభలు నిర్వహిస్తామని, ప్రతిరోజు నగరోత్సవం జరుగుతాయని శివ ప్రసాద్ శర్మ, ఆలయ స్థానాచార్య మరియు వైదిక కమిటీ సభ్యులు వివరించారు. మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు మరియు వైదిక కమిటీ సభ్యులు ఎల్.దుర్గా ప్రసాద్ వైదిక కమిటీ సభ్యులు చింతపల్లి ఆంజనేయ ఘనాపాటి, శ్రీ వి ఎస్ మహర్షి ఘనాపాటి వేద పండితులు మరియు వైది కమిటీ సభ్యులు, అర్చకులు శ్రీధర్ శర్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇరువురు, ఎఈఒ లు వివిధ విభాగాల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు .

# ఐదేళ్లుగా చెట్టుకిందె ఆవాసం

- ఇళ్ల పట్టా ఇవ్వండి మహాప్రభు
- అనర్హులకు ఇచ్చారు ఇదెక్కడి న్యాయం
- ఓ వృద్ధురాలు కలెక్టర్ గోడు వినిపించిన వైనం



**మచిలీపట్నం,కలెక్టరేట్,కలంకౌంటర్ :** చెరువుగట్టు పోరంబోకు భూమిలో ఉంటున్న తనను బయటకు గెంటివేసి కొందరు వ్యక్తులు దొడ్డిదారిన ఇండ్ల స్థలాలు పొందారని వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధ మహిళ సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేసింది. గత ఐదు సంవత్సరాలుగా చెట్టు కిందనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చలికి వణుకుతూ జీవనం సాగిస్తున్నానని ఏ ఒక్క అధికారి ప్రజా ప్రతినిధి చెల్లించడం లేదని కన్నీటి పర్యంతమైంది అధికారులు చొరవచూపి అనర్హులైన వారికి పట్టాలు మంజూరు చేసిన అధికార యంత్రాంగం పై చర్యలు తీసుకొని తాను నివాసం ఉంటున్న ప్రాంతంలో పట్టా మంజూరు చేయాలని నివాస గృహాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గత ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినితో పాటు నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు మోసపూరితంగా పట్టాలు మంజూరు చేయించారన్నారు జీవో నెంబర్ 463 ప్రకారం చెరువుగట్టు కాలవ గట్టు భూములకు పట్టాల యువరాదని అనుకూలమైన ప్రాంతాన్ని ఎంచుకొని పట్టాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అనర్హులైన వారికి పట్టాలు మంజూరు చేశారని కలెక్టర్ ఎదుట వాపోయింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాల నుండి చెరువుగట్టు పై నా కుటుంబంతో జీవించానని ఈ క్రమంలో ఏడాదికి రూపాయి పావలా చొప్పున ఇంటి పన్ను చెల్లించానని, అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా దిక్కు ముక్కు లేని నన్ను ఒంటరిని చేసి అధికార దర్పం ఉన్నటువంటి వ్యక్తులకు అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని నిబంధనలకు విరుద్ధంగా తెల్లరేషన కార్డు లేని ప్రభుత్వ ఉద్యోగి కుటుంబం కుటుంబానికి 100 గజాలు దేనికి తోడు వ్యవసాయ భూములు ఇతర స్థలాలు ఉన్నటువంటి మరో వ్యక్తికి 230 గజాలు భూమిని కేటాయిస్తూ పట్టాలిచ్చారని వివరించారు ఇళ్ల స్థలాల పంపిణీ పై ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించి అర్హురాలనైన నిరుపేదరాలనైన ఎలాంటి నిలువ నీడలేని అభాగ్యులర్ అయిన తనకు పట్టా మంజూరు చేసి ఇవ్వాలని కోరారు.



# కొత్త ఆలోచనలు, ఆధునికత కలయికే 'అమరావతి'

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు వారితో చర్చించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో ఉండేలా చూడడంతో పాటు.. నాణ్యమైన నివాస గృహాల నిర్మాణాల చేపట్టామని చంద్రబాబుకు సింగపూర్ అధికారులు చెప్పారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు తీర్చిదిద్దిన తీరును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. సింగపూర్ ప్రభుత్వం చేపట్టిన ఈ హౌసింగ్ ప్రాజెక్టు అన్ని వసతులతో పర్యావరణ హితంగా అద్భుతంగా నిర్మించారని చంద్రబాబు కితాబిచ్చారు. స్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్క్గా సింగపూర్ అర్బన్ రీడెవల్పమెంట్ అథారిటీ మార్చడం ఆకట్టుకుందని చంద్రబాబు అన్నారు.

**అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులకు సహకరించండి...**

బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు సందర్శన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు, సింగపూర్ అర్బన్ రీడెవలప్మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పోరేషన్ ఎంటర్ ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీలో చేపట్టనున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై ఈ భేటీలో చర్చించారు. ఏపీలో, అమరావతిలో చేపట్టబోయే హౌసింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు అధికారులను ముఖ్యమంత్రి కోరారు. రాజధాని అమరావతి నిర్మాణంలో అనుసరిస్తున్న విధానాలు, ఆలోచనలు, ప్రణాళికలను వారితో పంచుకున్నారు. బిడదారి ప్రాజెక్టును రూపొందించిన విధానం చాలా గొప్పగా ఉందన్నారు.

# పి4లో ఎన్నారైలు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి - ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదరికం లేని సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు పి4 కార్యక్రమాన్ని తీసుకొని వచ్చారు. కందుకూరు నియోజకవర్గంలో ఉండే ఎన్ఆర్ఐ లందరూ పి4 కార్యక్రమంలో భాగస్వాములై పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# మనసున్న దాతలు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం కు చెందిన పాలకుర్తి సత్యవతి అకాల మరణం చెందారు. అతి నిరుపేద కుటుంబానికి చెందిన పాలకుర్తి సత్యవతి కి గతంలో మామిడి మురళి సహకారంతో కొల్లు రవీంద్ర టిడ్కో గ్రౌండ్ ఫ్లోర్ లో కేటాయించారు. ఆర్థిక ఇబ్బంది కారణంగా దహన సంస్కారల నిమిత్తం పెద్ద మనసుతో ఐదు వేల రూపాయలు చొప్పున మాటూరి రాంబాబు,పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వర రావు ,ఘంటసాల గుర్నాథ్ బాబు లు సాయం అందజేశారు.

# హైదరాబాద్-విజయవాడ ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ 'భారీ' శుభవార్త




**హైదరాబాద్,కలంకౌంటర్ :** హైదరాబాద్-విజయ వాడ మార్గంలో ప్రయాణించే వారి కోసం తెలంగాణ ఆర్టీసీ శుభవార్తను ప్రకటించింది. ఈ మార్గంలోని బస్సుల్లో ఛార్జీలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఛార్జీలను 16 శాతం నుండి గరిష్ఠంగా 30 శాతం వరకు తగ్గిస్తున్నట్లు తెలిపింది. ఈ రాయితీలు ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ బుకింగ్లకు వర్తిస్తాయని పేర్కొంది. 'హైదరాబాద్-విజయవాడ మార్గంలో టిక్కెట్లపై భారీ తగ్గింపు' అంటూ ఒక ప్రకటనను విడుదల చేసింది. గరుడ ప్లస్ బస్సుల్లో టిక్కెట్ ధరపై 30 శాతం, ఈ-గరుడ బస్సుల్లో 26 శాతం ప్రత్యేక తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ బస్సుల్లో టిక్కెట్లపై 20 శాతం, రాజధాని, లహరి ఏసీ బస్సుల్లో 16 శాతం వరకు తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చిం ది. సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రీ ఫీజిబి లిటీ నివేదికను కేంద్ర జల సంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు - కమిషనర్ ఎన్.మౌర్య




**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 21 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. నగరపాలక సంస్థ రోడ్లలో వాహనాల పార్కింగ్ అరికట్టాలని, గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్ వద్ద వ్యర్థాలు తొలగించాలని కార్పొరేటర్ ఎస్.కె.బాబు కోరారు. సమస్యలను దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించేందుకు సి.పి.ఎం. నాయకులు కమిషనర్ ను అభినందించారు. భవానీ నగర్ లోని మురుగడు సందు ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు పరిశీలించాలని, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పెద్ద గుంత పూడ్చాలని, చెట్ల కొమ్మలు నరికిన వెంటనే తొలగించాలని, భూగర్భ డ్రైనేజీ కాలువలు ఓవర్ ఫ్లో అరికట్టాలని, మసీదు వీధిలోని చెత్త కుప్పలు తొలగించాలని, లీలా మహల్ నుండి కరకంబాడి మార్గంలో వీధి దీపాలు వెలిగించాలని, గంగమ్మ గుడి మార్గంలో కాలువలు ఏర్పాటు చేయాలని, గిరిపురం.నందు వేసిన బోర్ కు మోటార్ బిగించాలని, బైరాగిపట్టెడ లో సెట్ బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, వెంకట రెడ్డి కాలనిలో పగిలిన పైప్ లిన మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డి.ఈ.లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం - జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ,పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యల గురించి జిల్లా ఎస్పీ , పోలీస్ అధికారులుకు విన్నవించుకున్నారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అందిన ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, ఎక్కువగా భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, డిటిసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి- జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తమకు జరిగిన అన్యాయానికి న్యాయం కోసం సామాన్య ప్రజలు పోలీసు వారిని ఆశ్రయిస్తారని, సమస్యతో వచ్చిన ప్రజల సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో విచారణ జరిపి, పూర్తిస్థాయి పరిష్కారం అందించేలా ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలు సమస్యలను మీకోసం కార్యక్రమంలో అర్జీల రూపంలో సమర్పించడానికి రాగా ఎస్పీ వారి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యపై విచారణ చేసి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు వారి సమస్యలను ధైర్యంగా తెలుపుకునే అవకాశం కల్పించాలని పోలీస్ అధికారులకు తెలిపారు. మీకోసం కార్యక్రమానికి మొత్తం 38 ఫిర్యాదులు వచ్చాయి.

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన నాయకుడు నారా లోకేష్ - ఎమ్మెల్యే ఇంటూరి

-ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు.




**కందుకూరు,కలంకౌంటర్ :** కలంకౌంటర్,వలేటివారిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన సభా వేదికను సోమవారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో ఈ సభా వేదిక ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఎంతోమంది బాగా కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లారని తెలిపారు..రాష్ట్ర విద్యాశాఖ మంత్రివ యువ నాయకులు నారా లోకేష్ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, ఉపాధ్యాయుల బదిలీల విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు.. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కల్పించి, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు... పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థులకు పుస్తకాలు మరియు నోట్ బుక్స్ అందించిన ఘనత నారా లోకేష్ కి దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా సభా వేదికను నిర్మించిన దాతలు గుత్తా నరసింహం, శ్రీదేవి దంపతులను ఎమ్మెల్యే హృదయపూర్వకంగా అభినందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు గ్రామస్తులు కోరిన విధంగా జిల్లా పరిషత్ స్కూల్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, వలేటి నరసింహం, ఎంపీటీసీ నరసింహం, వలేటి శ్రీధర్ నాయుడు, కాకుమాని మాల్యాద్రి, గుత్తా మహేశ్వరరావు, గుత్తా కొండయ్య, సాధు శ్రీలత తిరుపతి స్వామి, కొంకా రమేష్ మన్నం మధు,, పరిటాల శివ, గుత్తా అచ్యుత్, గుత్తా మధు యలమద మహేష్, సాధు చెన్నకేశవులు , చెరువుపల్లి సాంబయ్య, నవులూరి రాజా రమేష్, ప్రగడ శ్రీనివాసులు ఘట్టమనేని లక్ష్మీనరసింహం కాకుమాని అశోక్ మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# ఏఎంసి చైర్మెన్ గా రెబ్బవరపు మాధవి కి అవకాశం కల్పించండి.....



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ మహిళకు కేటాయించడం పట్ల ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు , కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు మాల్యాద్రి ఆధ్వర్యంలో మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రెబ్బవరపు మాధవికి ఏఎంసి చైర్మెన్ గా అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు . స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలబడి , కష్టపడి పనిచేసిన వారిని అధిష్టానం గుర్తుపెట్టుకొని అవకాశాలు కల్పిస్తుందన్నారు. కందుకూరు నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడిన తర్వాత ఎస్సీలకు కేటాయించడం ఇదే తొలిసారి కాగా అందునా మహిళలకు కేటాయించడం చూస్తుంటే చంద్రబాబు నాయుడుకు మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుని కలిసిన వారిలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ , ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య , నెల్లూరు పార్లమెంటు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అక్కిలగుంట ప్రకాశం , కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గోచిపాతల ప్రసాదు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు , జనసేన నాయకులు సుమన్ తదితరులు ఉన్నారు.....

# దామా వారి దేవర కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం గుడ్లూరు పంచాయతీలో జరిగిన దామా వారి దేవర కొలుపుల కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు దామా. వెంకటేశ్వర్లు, దామా సోమనాయుడు, దామా బ్రహ్మయ్య, దామా శ్రీనివాసులు, దామా రాములు పువ్వాడి వేణు, ఉమ్మనేని సుబ్బారావు, మేకల మాల్యాద్రి, మేకపోతుల రాఘవులు, చిత్తారి మల్లికార్జున, జొన్నలగడ్డ రవణమ్మ, సింగమనేని పద్మావతి ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు....

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల తక్షణమే స్పందించాలి - సిఐ సోమశేఖర్




**పొన్నలూరు, కలంకౌంటర్ :** పొన్నలూరు పోలీస్ స్టేషన్ ను కొండపి సిఐ సోమశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును, పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని,గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో సీఐ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నారని... ఇలానే కొనసాగించాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు,ఇతర వస్తువులు తనిఖీ చేసి వాటిని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే వారి నుండి ఫిర్యాదులు స్వీకరించాలని, వారితో మర్యాదగా, గౌరవంగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు పై వెంటనే త్వరితగతిన స్పందించి, ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,వారి విధుల వంటి వాటిపై ఆరాతీశారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని ఎస్సై అనుక్ కు సూచించారు.

# పాస్‌పోర్ట్ దరఖాస్తుల విచారణ సేవల్లో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలచిన కృష్ణా జిల్లా పోలీసులు.



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జూలై 2024 నుండి జూన్ 2025 మధ్యకాలంలో 30వేల వరకు పాస్‌పోర్ట్ దరఖాస్తులను విచారణ పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్టం లో తృతీయ స్థానాన్ని సాధించిన కృష్ణాజిల్లా పోలీస్ ను రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు. ప్రశంస పత్రాన్ని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు స్పెషల్ బ్రాంచ్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావు కి అందజేసి, అభినందనలు తెలియజేసి ఇప్పుడు తృతీయ స్థానం సాధించామని, మరింత అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ మొదటి స్థానంలో నిలవడానికి కృషి చేయాలని తెలిపారు.

# రాష్ట్ర మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో సుప్రీత మరియు సర్వాణి రజత మరియు కాంస్య పతకాలు గెలుచుకున్నారు




**విజయవాడ,కలంకౌంటర్ :** జూలై 27 నుండి 28 వరకు భీమవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులైన మహిళా FIDE మాస్టర్స్ పొట్లూరి సుప్రీత మరియు సర్వాణి చీదెల్ల వరుసగా రజత మరియు కాంస్య పతకాలను సాధించారు. టోర్నమెంట్ అంతటా అద్భుతమైన వ్యూహాత్మక నైపుణ్యం మరియు స్థిరత్వాన్ని ప్రదర్శించి, ఇద్దరు క్రీడాకారిణులు 7కి 6 పాయింట్లు సాధించారు. ఈ విజయంతో, వారు రాబోయే జాతీయ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించడానికి అర్హత సాధించారు. వారి విజయాన్ని గౌరవించేందుకు, సోమవారం కానూరులోని శ్రీ కృష్ణ రుద్ర మెడికల్ అకాడమీలో ఒక సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, వాసవి జాగృతి గవర్నర్ అలుమూరి అమరాంత్, శ్రీ కృష్ణ రుద్ర మెడికల్ అకాడమీ డైరెక్టర్ మోదుకూరి కృష్ణ ప్రసాద్, వాసవి జాగృతి క్యాబినెట్ కార్యదర్శి అప్పన సాయిబాబు, జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మద్దతుగా సుప్రీత మరియు సర్వాణిలకు ఒక్కొక్కరికి రూ.6,400 అందజేశారు. ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ కార్యదర్శి ఎన్. సుజాత, విద్యార్థుల విజయాల పట్ల గర్వంగా వ్యక్తం చేశారు మరియు చెస్‌లో వర్ధమాన ప్రతిభను ప్రోత్సహించినందుకు మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అపోహలు తొలగించి.. ఆయుష్ పోయండి..

● ప్రాచీన వైద్య విధానం మన దేశ వారసత్వ సంపద ● ఆరోగ్య ఆంధ్ర, స్వర్ణాంధ్ర సాకారానికి కలిసికట్టుగా అడుగులేద్దాం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రాచీన వైద్య విధానం మన దేశ వారసత్వ సంపద అని.. ఆయుర్వేదం, యోగా, ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్)పై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి, ప్రభుత్వాల చొరవ, ఏర్పాట్లను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన వారితో పాటు కలెక్టరేట్ సందర్శకులకు సంప్రదాయ వైద్య విధానాల విశిష్టతను వివరించడంతో పాటు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ద్వారా 130 మందిని పరీక్షించి, ఔషధాలు అందించారు. కలెక్టర్ లక్ష్మీశ ఇగ్నైట్ సెల్‌ను సందర్శించి ఆయుష్ వైద్యులకు వివిధ సూచనలు చేశారు. జిల్లాలో ఏడు ఆయుష్మాన్ మందిర్‌లు, ఆరు ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయని.. అదేవిధంగా విజయవాడలో డా. ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, డా. నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఉన్నాయని, వీటిద్వారా మెరుగైన సేవలు అందించేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047ను ఆవిష్కరించడం జరిగిందని.. ఆరోగ్య ఆంధ్ర సాధనలో ఆయుష్ విభాగం కూడా కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఇటీవల యోగా ఔన్నత్యాన్ని ప్రజలందరికీ చేరువచేసి, ఆరోగ్య ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాలు విజయవంతమయ్యాయని, ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాచీన వైద్య విధానాలను భావితరాలకు అందించేందుకు సమష్టిగా అడుగులేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, డా. పి.సుకన్య, డా. మొహమ్మద్ జునీద్, డా. విష్ణువర్ధన్, పీజీ స్కాలర్లు, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డుల్లో మెగా పీటీఎం














(మొదటిపేజీ తరువాయి)

ఇండిపెండెంట్ విట్నెస్ ద్వారా డేటాను %బాజుగ్బా% యాప్ ద్వారా సేకరించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు ఈ అవార్డును నిర్ధారించడానికి 61000 పాఠశాలల నుండి సేకరించిన డేటాను విశ్లేషించారు. అధికారిక గిన్నిస్ ప్రపంచ రికార్డు ధృవపత్రం ఆగస్టు రెండవ వారంలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేస్తారు.

**ఈ అవార్డు ఎనలేని ప్రోత్సాహం- సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్**

**బి శ్రీనివాసరావు**

విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గారి ఆలోచనల మేరకు తీసుకొస్తున్న ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లో భాగంగా అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తున్న ప్రభుత్వం, రాష్ట్ర విద్యా శాఖ, సమగ్రశిక్ష, ఉపాధ్యాయులకు మెగా పీటీఎం నిర్వహణ ద్వారా అందిన గిన్నిస్ అవార్డు ఎనలేని ప్రోత్సాహంగా నిలుస్తుందని సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు యూనిఫాం లు అందజేసిన వాసవి క్లబ్స్









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక లేడీ యాంప్థిల్ జూనియర్ కాలేజ్ లో పేద విద్యార్థులకు వాసవి క్లబ్స్ ఆద్వర్యంలో యూనిఫాం లు అందజేసిన వాసవి క్లబ్స్ గవర్నర్ అన్నం సాయి సునీత.ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్,వనిత క్లబ్, కపుల్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయించాలి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఈనెల 11వ తేదీన వాయిదా వేసిన మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వెంటనే నిర్వహించి, హైకోర్టు వారి ఉత్తర్వులను గౌరవించే విధంగా స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం కన్వెన్షన్ హాల్, మ్యూజియం మరియు లైబ్రరీ నిర్మాణమునకు భూమిని బదలాయింపు చేయుట గురించి మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే మీకోసం లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు సోమ వారం అర్జీ సమర్పించి మాట్లాడుతూ.... మన మచిలీపట్నంనకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిన స్వతంత్ర సమరయోధులు, మచిలీపట్నం కేంద్రంగా ఆంధ్ర బ్యాంకు ను స్థాపించిన ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు, స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం నిర్మించే స్మారక భవనానికి గత వైసిపి ప్రభుత్వం లోనే అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థలం కేటాయించితే, మచిలీపట్నం నగర కార్పొరేషన్ వైసీపీ పాలకవర్గం పట్టాభి స్మారక భవనానికి భూమిని బదలాయించుట గురించి కౌన్సిల్లో చర్చించి వారికి ఉన్న అభ్యంతరాలు చెప్పటానికి కూడా గత నాలుగు సంవత్సరాల నుండి కాలయాపన ఎందుకు చేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదు అన్నారు. పట్టాభి స్మారక భవనం కోసం భూమి బదలాయింపు కొరకు హైకోర్టుకు వెళితే హైకోర్టు వారు కౌన్సిల్ ఎజెండాలో పెట్టి చర్చించమన్నా కూడా హైకోర్టు వారి ఉత్తర్వుల కు కూడా కాలయాపన చేస్తూ మున్సిపల్ పాలకవర్గం గౌరవం ఇవ్వడం లేదు అంటే ఇంకా సామాన్యుల విషయం ఎలా ఉంటుందో ప్రజలు గ్రహించాలి అన్నారు. ఇప్పటికైనా మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యులు అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మన మచిలీపట్నంనకు పేరు ప్రఖ్యాతలు తెచ్చి ఎంతోమంది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు, స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం నిర్మించే కన్వెన్షన్ హాల్ కు నగర కార్పొరేషన్ మంచి నిర్ణయం తీసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా పట్టాభి స్మారక భవనాన్ని ఏర్పాటు చేయించాలని మీకోసం లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతి పత్రం అందజేయడం జరిగింది అన్నారు.

# రాష్ట్రంలో అర్హత గల ప్రతి పేదవానికి పక్కా ఇల్లు.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

– రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి,వంగలపూడి అనిత వెల్లడి.






**ఏలూరు/కైకలూరు,కలంకౌంటర్ :** కైకలూరు సియన్ ఆర్ గార్డెన్స్ లో సోమవారం నియోజక వర్గంలో ఇళ్ళ నిర్మాణాలు,ఇళ్ల పట్టాలు,ఇతర సమస్యలపై రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి,రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా అధికారులతో సమీక్ష సమావేశం పాల్గొన్నారు.నియోజక వర్గంలో మండలాలు వారీగా ఇళ్ల నిర్మాణాలు,ఇళ్ల స్థలపట్టాలు,ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కైకలూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణ సమస్యలపై స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్ సమీక్ష నిర్వహించారు. కైకలూరు గ్రీన్ విలేజ్,కలిదిండి, మండవల్లి మండలాల్లోని లే అవుట్లలో సమస్యలపై సమీక్ష నిర్వహించారు.తొలుత కైకలూరు గ్రీన్ విలేజీని సందర్శించి అక్కడ అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్థంగా ఉన్న ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల సమస్యను,తాగునీటి సమ–స్యను,విద్యుత్తు వంటి మౌలిక సమస్యలను స్వయంగా పరిశీలించానని అన్నారు.గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో 15 లక్షలు 30 లక్షలు పక్కా గృహాలు నిర్మిస్తున్నామని ఆర్భాటపు ప్రచారాలు చేసి చివరకు లబ్దిదారులను నిండా ముంచేసిందని ఆరోపించారు. ఒక ప్రణాళిక లేకుండా ఒక విజన్ లేకుండా గృహనిర్మాణ పథకం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు.ఫలితంగా లబ్దిదారులు తీవ్రంగా నష్ట పోయారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన మిగిలిన ప్రతి పేదవానికి అర్బన్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున నివేశనా స్థలాలు మంజూరు చేసి రూ.2.50 లక్షలు చొప్పున మంజూరు చేస్తుందని తెలిపారు. అదనంగా బీసీలకు,ఎస్సీలకు రూ 50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ 75 వేలు నుంచి రూ 1 లక్ష చొప్పున అదనంగా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారన్నారని తెలిపారు.స్వంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్దిదారులకు రూ.1 లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. కైకలూరు గ్రీన్ విలేజ్లో అసంపూర్తిగా నిలిచి పోయిన ఇళ్లను త్వరితగతిన క్రొత్త కాంట్రాక్టరుతో నిర్మాణాలు పూర్తి చేస్తామని,అందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ విలేజ్లో రోడ్లు,విద్యుత్తు,తాగునీరు వంటి ప్రధాన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మంత్రి సారథి స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో గృహ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగిందని, దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు కూడా ఖచ్చితంగా తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం,అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే దమ్ము ఒక కూటమి నాయకులకే ఉందని స్పష్టం చేశారు.ఎందుకంటే సంక్షేమం,అభివృద్ధి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే నని పేర్కొన్నారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు.అలాగే ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అభివృద్ధి జరుగుతోందా లేదా అన్న విషయాలపై బాధ్యతాయ–ుతంగా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకోవటం గర్వకారణం అన్నారు.గత ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు తప్ప సంక్షేమం,అభివృద్ధి కానరాలేదన్నారు.అలాగే గత ప్రభుత్వంలో దోపిడీలకు, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిని శిక్షిస్తామని, సంక్షేమ పథకాల అమలుతోపాటు అక్రమార్కులపై చర్యలు ఉంటాయని ఆమె ఉద్ఘాటించారు.కైకలూరు నియోజకవర్గంలో 'డాగ్ ట్రైనింగు సెంటరు' ఏర్పాటుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రక్షిత తాగునీటి సమ–స్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని,రూ.2.40 కోట్లతో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. అలాగే కైకలూరు గ్రామ పంచాయతీ సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, తాగునీరు, పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. నియోజకవర్గంలో పక్కాగృహ నిర్మాణ వ్యవస్థపై పూర్తిగా అసంతృప్తి ఉందని, కైకలూరు గ్రీన్ విలేజీ రూ 200 కోట్లు ఖర్చుపెట్టినా లబ్ది దారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. లబ్దిదారుల ఎంపికలోను తప్పులు జరిగాయని అన్నారు.లే–అవుట్లలో కొన్ని ప్లాట్లు ఇంకా లబ్దిదారులకు కేటాయించలేదని, రహదారులు నిర్మాణం జరగలేదని,డ్రెయిన్ల నిర్మాణం జరగలేదని,తాగునీరు, విద్యుత్తు సౌకర్యం పూర్తిస్థాయి లో కల్పించలేదని అన్నారు. చాలా ఇళ్లు అసంపూర్తిగా నిలిచి పోయాయన్నారు. అలాగే కలిదిండిలో 600 మందికి ప్లాట్లు కేటాయించారని, రెండు ఇళ్లు మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని,మిగిలిన ప్లాట్లు మొత్తం లెవిలింగు చేయాల్సి ఉందని, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.6 నుంచి 7 కోట్లు అవసరం అవుతాయని అన్నారు. మండవల్లిలో కూడా అదే పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఏపి గృహ నిర్మాణ ఎండి యం.శివ ప్రసాదు,మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ గృహ నిర్మాణ శాఖ పిడి జి.వి.వి. సత్యనారాయణ, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు,డ్వామా పిడి కె.వి. సుబ్బారావు,జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.అనురాధ, జిల్లా పరిషత్తు సిఇవో యం. శ్రీహరి,ఆర్ బ్ల్యూఎస్ అధికారి జి.త్రినాథ బాబు,పంచాయతీ రాజ్ ఇంచార్జి పిడి కె.శ్రీనివాసు,డిఇలు, అసిస్టెంటు ఇంజినీర్లు, తహాశీల్దార్లు, యంపిడివోలు, ఇతర ప్రభుత్వ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు, కూటమి నాయకులు,గ్రీన్ విలేజీ లబ్దిదారులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# మీకు ఇచ్చేది పదవులు కాదు బాధ్యత

**● గతంలో వక్ఫ్ బోర్డ్ ద్వారా ముస్లిం లకు ఎటువంటి సంక్షేమం జరగలేదు. ● రాబోవు విద్యా సంవత్సరంలో 500 మందికి ఉచిత విద్య అందించబోతున్నాం. ● ఇందులో ప్రతి వక్ఫ్ బోర్డ్ సంస్థ భాగస్వామ్యం కావాలి. ● మీ సొంత పిల్లలను చదివించిన భావనతో బాధ్యత తీసుకోండి. ● దేవుడి ఆస్తులను చౌకగా కోరుకోకండి, ప్రీమియంగా తీసుకోండి. ● ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఏఎస్, ఐపిఎస్ కోచింగ్ అందిస్తాం. ● నాతో కలిసి నడవండి ముస్లిం సమాజాన్ని ఉన్నతంగా నిలుపుదాం.● షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్**



**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడలోని కాలేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఇందాద్ ఘర్ కాంప్లెక్స్ లోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 5 వ వక్ఫ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. బోర్డు సమావేశ అనంతరం గత బోర్డు సమావేశంలో నియమించిన పలు ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీల వారితో ఆయన సమావేశం నిర్వహించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మీకు ఇచ్చేది పదవులు కాదని బాధ్యతని ఇస్తున్నామని అన్నారు. గతంలో వక్ఫ్ బోర్డు ద్వారా ముస్లిం సమాజానికి ఎటువంటి సంక్షేమం జరగలేదని అన్నారు. గతంలో ఎంతో మంది దాతలు వేల ఎకరాలు దానం చేసి వెళ్లారు. దాదాపు 70 వేల ఎకరాల భూమిలో 30 వేల ఎకరాలు ఆక్రమణకు గురై మన చేతుల్లో లేకుండా పోయింది. మిగిలిన భూముల్లో దాదాపు 15 వేల ఎకరాలు ప్రభుత్వం అక్వైర్ చేసుకుందని అన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం నూతన ఉచిత విద్యా పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. రాబోవు విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతమైన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ ఉన్నత ఇంటర్మీడియట్ విద్య ను అందించబోతున్నామని తెలిపారు. ప్రతి వక్ఫ్ బోర్డ్ సంస్థ ఆదాయానికి అనుగుణంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలని అన్నారు. మీ మీ సంస్థలలో ఆదాయాన్ని పెంచి విద్యార్థుల చదువుకు ఉపయోగపడాలని అన్నారు. మీ సొంత పిల్లలను చదివించిన భావనతో వారి బాధ్యత తీసుకోండి. దేవుడి ఆస్తులను చౌకగా కోరుకోకూడదని, ప్రీమియం గా తీసుకోవాలని అన్నారు. ఒక విద్యార్థిని సమాజం ఉన్నత చదువు చదివించాలని సమాజానికి తిరిగి మేలు చేస్తాడని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యతోపాటు ఉచిత ఐఏఎస్ కోచింగ్ ను అందిస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని పలుచోట్ల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు నేర్పించి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. అందరూ నాతో కలిసి నడవండి ముస్లిం సమాజాన్ని ఉన్నతమైన స్థానంలో నిలబెడతా. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ మొహమ్మద్ అలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com